
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 27 జూలై 2025




స్పందించకపోవడంతోనే కోర్టును ఆశ్రయించాం

- ఉగాది సంఘం సభ్యులు

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను వ్యక్తంచేసినా సంఘం పెద్దలు స్పందించకపోవడంతోనే కోర్టును ఆశ్రయించామని ఉగాది సంఘం సభ్యులు చిమ్మని ప్రకాష్, కోడం రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశాలి సంఘం ఎన్నికల నిర్వహణపై సంఘం నాయకుల వైఖరిని ఖండించారు. ఎన్నికల నామినేషన్ల ఫీజులను తగ్గించాలని బైలాకు వ్యతిరేకంగా జరుగుతున్న ఎన్నికలను బహిష్కరించాలని తాము పిలుపునిచ్చామని, అయినా సంఘం పెద్దల నుంచి స్పందన రాకపోవడం విచారకరమన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. మధ్య తరగతి పద్మశాలీలకు అనుకూలంగా ఎన్నికల నిర్వహణపై న్యాయస్థానం స్టే ఇచ్చిందన్నారు. ఎన్నికల బైలాకు అనుగుణంగా పద్మశాలీల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా సంఘం పెద్దలు పునరాలోచన చేయాలని కోరారు. అన్ని సంఘాలను ఒకతాటిపైకి తీసుకొచ్చి తిరిగి ఎన్నికలను జరపాలన్నారు. సమావేశంలో నాయకులు, రిక్కుమల్ల మనోజ్‌కుమార్, కొండ ప్రతాప్, గుజ్జె శివరాం, నాగుల శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, గజ్జెలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికలు నిలిపివేస్తున్నాం

జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు ఈనెల 27న జరగాల్సిన సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలను నిలిపివేస్తున్నట్లు ఎన్నికల అధికారి మామిడాల భూపతి ఒక ప్రకటనలో తెలిపారు.



గంభీరావుపేట మండలంలో నిండుగా ప్రవహిస్తున్న మానేరు వాగు..

ముసురు వాన..

జిల్లాలో ఇప్పటి వరకు వానకాలం సాగు ఇలా..

మండలం	వరి	పత్తి	మొత్తం
గంభీరావుపేట	10,000	110	1,01,023
ఇల్లంతకుంట	22,500	12,000	35,470
ముస్తాబాద్	17,500	530	18,265
సిరిసిల్ల	3,500	700	4,206
తంగళ్లపల్లి	13,000	870	13,953
వీర్నపల్లి	7,800	300	8,100
ఎల్లారెడ్డిపేట	11,000	2,500	13,500
బోయినపల్లి	4,800	6,400	11,280
చందుర్తి	10,000	6,100	16,122
కోనరావుపేట	14,000	3,200	17,200
రుద్రంగి	5,910	2,190	10,194
వేములవాడ	3,800	4,600	8,438
వేములవాడ రూరల్	8,300	3,800	12,139
మొత్తం	1,32,110	43,300	1,78,990

జూలై 26వ తేదీ వరకు జిల్లాలో వర్షపాతం(మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	357.2	200.2
చందుర్తి	374.6	306.0
వేములవాడ రూరల్	346.7	306.5
బోయినపల్లి	304.1	259.9
వేములవాడ	353.5	315.8
సిరిసిల్ల	336.8	270.0
కోనరావుపేట	297.4	353.5
వీర్నపల్లి	313.7	293.7
ఎల్లారెడ్డిపేట	309.8	304.7
గంభీరావుపేట	299.4	339.8
ముస్తాబాద్	265.7	352.3
తంగళ్లపల్లి	341.2	402.2
ఇల్లంతకుంట	258.9	339.6
సగటు వర్షపాతం	319.9	310.6

- జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం
- జోరందుకున్న పంటల సాగు
- పొలం పనుల్లో రైతులు బిజీ
- 1.32 లక్షల ఎకరాల్లో వరి నాట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో వానాకాలం సాగు జోరందుకుంది. మూడు రోజులుగా ముసురు వానలతో వాడిపోతున్న పత్తి, మొక్కజొన్న మెట్ట పంటలు ఊపిరి పోసుకున్నాయి. దీంతో రైతులు హుషారుగా పొలం పనుల్లో బిజీగా మారిపోయారు. వరి నాట్లు జోరు పెరిగింది. ముసురు వానలోనూ రెండు రోజుల్లోనే పదివేల ఎకరాల్లో నాట్లు వేశారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43వేల 783 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 1,78,990 ఎకరాల్లో సాగు చేశారు. వరి సాగు 1,32,110 ఎకరాల్లో నాట్లు పడ్డా యి. పత్తి 43,300 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 2,903ఎకరాలు, కందులు 552 ఎకరాలు, పెసర 18 ఎకరాలు, ఇతర పంటలు 56 ఎకరాలో వేశారు.

చెరువులు, కుంటలకు జలకళ..

జిల్లాలో ముసురు వర్షాలతో సిరిసిల్ల మానేరు వాగు, వేములవాడ మూలవాగులతో పాటు చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. జిల్లా కేంద్రంలో పాటు వివిధ మండలాల్లో ముసురు వానతో రోడ్లు చిత్తడిగా మారి నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముస్తాబాద్, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో చెరువుల్లోకి 75 శాతం నుంచి 100 శాతం వరకు నీళ్లు చేరాయి. మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు వాతావరణం చల్లబడింది.

జిల్లాలో ఉన్న ప్రధానమైన ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లోకి 235 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో ఇప్పటివరకు 27.55 టీఎంసీల సామర్థ్యానికి 6.965 టీఎంసీల నీరు ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టులో 0.78 టీఎంసీలు ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టులోకి వంద క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, 3.50 టీఎంసీలకు 1.25 టీఎంసీల

మిగతా 8వ పేజీలో

ఆచార్య జయశంకర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ప్రకటించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో శనివారం ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటుపై కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మహేష్ బీ గీతేతో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య జయశంకర్ చిత్రపటం ఉందని, అవకాశం ఉన్నచోట విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంభీరావుపేట నమాజ్ చెరువు వద్ద ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహ ఏర్పాటు గురించి చర్చించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెరువు, ఎఫ్‌టీఎల్‌లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలులేనందున జయశంకర్ విగ్రహం ఏర్పాటు కుదరదని తెలిపారు. విగ్రహ కమిటీ సభ్యుల అంగీకారం మేరకు గంభీరావుపేట మండల కేంద్రంలో ఉన్న కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను రోడ్లు, భవనాల శాఖ అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహాచారి, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి..

- నివాళులర్పించిన బీజేపీ నాయకులు, మాజీ సైనికులు



కార్గిల్ లేక్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల త్యాగాలు, మరువలేనివని, కార్గిల్ యుద్ధం విజయానికి 25 ఏళ్లు పూర్తి చేసుకుందని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, కార్గిల్ యుద్ధంలో పాల్గొని పదవీవిరమణ పొందిన లెఫ్టినెంట్ కల్నల్, ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కృష్ణలు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ వద్ద శనివారం కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్‌లకు మాజీ సైనికులతోపాటు ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం కార్గిల్ లేక్ వైజయంతి యుద్ధట్యాంక్ వద్ద ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. యుద్ధ ట్యాంక్ వద్ద కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్‌లకు నివాళి తెలిపారు. ఈ సందర్భంగా ఆడెపు రవీందర్, కృష్ణలు మాట్లాడుతూ కార్గిల్ విజయానికి 26 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్గిల్ విజయదివస్‌ను జరుపుకోవడం హర్షణీయ మన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మాజీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, ఆడెపు రేవంత్, గాజుల వేణు, మోర శ్రీనివాస్, చొప్పదండి అంజన్న, మోర రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్



సిరిసిల్లలో ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ రవీంద్రనాయక్

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బీ రవీంద్రనాయక్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా ప్రధానవైద్యశాలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులను శుక్రవారం ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బీ రవీంద్రనాయక్ తనిఖీలు చేపట్టారు. జిల్లా వైద్యశాలను సందర్శించి మందుల నిల్వలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు నిలువ ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజితను ఆదేశించారు. అనంతరం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీలు చేశారు. ఫైర్, వేస్ట్ మేనేజ్మెంట్, రిజిస్ట్రేషన్స్, రెన్యువల్స్‌ను సరైన సమయంలో నమోదు చేయించుకోవాలని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులకు సూచించారు. కేంద్ర ఆరోగ్య పథకాలపై లక్ష్యాలను సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రజిత, ప్రోగ్రాం ఆఫీసర్లను ఆదేశించారు. వెంట వైద్యులు సంపత్‌కుమార్, అంజలి, అనిత, రామకృష్ణ, డిప్యూటి డెమో రాజకుమార్, డీపీఎంఓలు శ్రీనివాస్, సురేష్, దేవిసింగ్, హెచ్‌ఈవో లింగం బాలయ్య, మహేష్‌గౌడ్ ఉన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ



వన మహోత్సవంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ

వేములవాడ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ అన్నారు. వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు ఆవరణలో వన మహోత్సంలో భాగంగా శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లు పెంచితే పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. ప్రకృతికి సహజ సిద్ధంగా ఉండే విధంగా మొక్కలు పెంచాలని సూచించారు. న్యాయవాదులు నిరంతరం బిజీబిజీగా ఉండే పరిస్థితిల్లో చెట్లు నాటడం ఎంతో ప్రశాంతత కలిగిస్తాయని అన్నారు. వేములవాడకు అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కోర్టు పైఅంతస్తు నిర్మాణానిక రూ. 5 కోట్లు మంజూరుకు హైకోర్టు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. జ్యుడిషియల్ ఆఫీసర్ నివాస సముదాయం నిర్మాణం కోసం రూ.1.75 కోట్లు మంజూరు కోసం, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా కోర్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, గుడిసె సదానందం, పొత్తూరి అనిల్ కుమార్, పెంట రాజు, కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్య ద్వారానే పేదరికాన్ని అధిగమించవచ్చు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



ఆన్‌లైన్ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారా మాత్రమే పేదరికాన్ని అధిగమించవచ్చని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శనివారం రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ విద్యాసంస్థలలో పోటీపరీక్షలకు సన్నద్దులను చేయడానికి ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైప విద్యావేత్తలతో బోధన జరుగుతుందన్నారు. ఢిల్లీలోని విద్యార్థులు పొందే శిక్షణ ఇప్పుడు సాంకేతికతను వినియోగించుకొని సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ తరగతులలో విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నటిసమ్‌లాంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం విద్యవైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మాడల్ స్కూల్‌లోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెలవు రోజుల్లోని కొద్ది సమయాన్ని చదువుకోసం వెచ్చించాలని సూచించారు. విద్యార్థులు సమస్యలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. విద్యుత్ మోటార్ కావాలని కోరగా నిధులు మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించారు. కిచెన్‌షెడ్‌ను పరిశీలించి, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను ఫోన్‌లో అభినందించిన మంత్రి

జిల్లాలోని విద్యార్థులకు ఆన్ అకాడమి ద్వారా ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న రాష్ట్ర బీసీ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఫోన్ ద్వారా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను అభినందించారు. పోటీపరీక్షలకు విద్యార్థులను సన్నద్దులను చేయడానికి కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని ఇదే విధానాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం దివ్యాంగుల ఆర్థిక పునరావాసం కింద ఇల్లంతకుంటలో కంగన్‌హాల్ పెట్టుకోవడానికి భాగ్యలక్ష్మి అనే మహిళకు పూర్తిసబ్సిడీతో రూ.50వేల చెక్‌ను అందించారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ఆదివారం జరిగే సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో ఆదివారం బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల స్వామిలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ మహాసభకు జిల్లాలోని బీడీ కార్మికులు అందరూ హాజరై విజయవంతం చేయాలని రమేష్ కోరారు.

ఈ సమావేశంలో బీడీవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, జిందం కమలాకర్, దాసరి రూప, బెజుగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కంకర, మట్టికుప్పలు



రోడ్డుపై వదిలేసిన కంకర, మట్టికుప్పలు

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పాత బస్టాండ్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే రోడ్డు వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ. లక్షతో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహం ఏర్పాటుకు పాత బస్టాండ్ సమీపం కరీంనగర్ వెళ్లే రోడ్డు మధ్య డివైడర్‌ను ఆనుకొని మున్సిపల్ అధికారులు అనధికార కాంట్రాక్టర్ ద్వారా (టెండర్ లేకుండా)పిల్లర్ ఏర్పాటు కోసం గొయ్యి తీయించారు. ఆ కాంట్రాక్టర్ పిల్లర్ నిర్మాణం పూర్తి చేశాడు. పిల్లర్ నిర్మాణం కోసం తీసిన గొయ్యిలోని మట్టిని, నిర్మాణం కోసం తెచ్చిన కంకర మిగిలిపోగా రోడ్డుకు మధ్యలోనే నిర్లక్ష్యంగా వదిలేశాడు. పిల్లర్ నిర్మాణం పనులు పూర్తి అయ్యాక మట్టిని, కంకర, బండరాళ్లను తొలగించకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. స్వల్ప గాయాలతో బయటపడుతున్నారు. కొత్త వ్యక్తులు ఆదమరిచి అటువైపు వాహనాలపై వస్తే మాత్రం పెను ప్రమాదం తప్పదని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే గానీ మున్సిపల్ అధికారులు స్పందించరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బహుదూరపు బాటసారులు





- జీవాలతోనే జీవనం సాగిస్తున్న గొర్రెల కాపరులు
- పల్లెపల్లెనా పాలమూరి ఎలమందల సంచారం
- ఆరు నెలల క్రితం ఇంటి నుంచి ప్రయాణం..
- కుటుంబానికి, ఊరికి దూరంగా జీవనం

చిగురుమామిడి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పొద్దున లేచినప్పటి నుంచి చీకటి పడే వరకు వారిది పాదయాత్రే.. పండుగలు, పబ్బాలుండవు.. చెట్లు , గుట్టలే వీరికి చుట్టలు. ఎత్తైన కొండలు ఎక్కి దిగుతారు. వాగుల్లో వంకల్లో పండుకుంటారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. జీవాలతోనే (గొర్ల మందలు) జీవనం సాగిస్తారు. ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు కుటుంబం, ఊరికి దూరంగా గొర్ల మందల తోనే ఉంటారు పాలమూరు (మహబూ బ్‌నగర్)జిల్లా గొర్రెల కాప రులు. వీరు మందలతో చిగురు మామిడి మండలం మీదుగా వారి స్వగ్రామం వెళ్తుం డుగా 'ఆంధ్రజ్యోతి' వారిని పలకరిం చింది. వారి జీవన శైలిపై అరా తీసింది..

తాతలు, తండ్రుల కాలం నుంచి..

మహబూబ్‌నగర్ జిల్లా నార యణపేట మండలంలెపి మరికల్, పాత పల్లి, ఎగ్లాస్‌పూర్ తదితర గ్రామాల్లో వెయ్యి వరకు గొర్ల కాపరుల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా గొర్ల



బైక్ పై సామగ్రి తీసుకెళుతున్న యువకులు

మందలతోనే సంచారం చేస్తూ జీవనం గడుపుతారు. ఇది వారి తాతలు, తండ్రుల కాలం నుంచి అనుసరిస్తున్న జీవన శైలి. వీరుండే ప్రాంతాల్లో పచ్చ గడ్డి దొరకక గొర్రెల మందలను తీసుకొని నీరు, మేత లభించే ప్రదేశాలకు వెళుతుంటారు. ఎకరం, రెండె కరాల భూములు ఉన్నా వర్షాధారంగానే వ్యవసాయం చేస్తారు. అందుకే గొర్రెల పెంపకాన్ని జీవనాధారం చేసుకుని జీవిస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరికి మూడు వంద వరకు గొర్లుంటాయి. ప్రతీ రోజు పది కిలోమీటర్లకు పైగా నడుస్తూ గొర్రెలను మేపుతుంటారు. ఒక ద్విచక్ర వాహ నాన్ని తమతో ఉంచుకుంటారు. వీరికి అవసరమయ్యే సామగ్రిని ఆ బైక్‌పై తరలిస్తుంటారు.

రోగాలతో గొర్రెలు చనిపోతే నష్టం..

గొర్రెలు ఎప్పటికప్పుడు రోగాలు బారిన పడకుండా చుసుకుంటారు. గొర్రెలకు అవసరమైన మందులు వీరి వెంట ఉంటాయి. ఏదైనా తీవ్ర ఇబ్బందులు ఎదురైతే సమీప గ్రామాల్లోని పశువుల ఆసుపత్రికి వెళుతుంటారు. చిటుకు రోగాలు వచ్చినప్పుడు మాత్రం వందల సంఖ్యలో గొర్లు చనిపోతాయి. ఇటువంటి సందర్భాల్లో వీరు పడిన శ్రమ వృథా అవుతుంది. ఒక్కో మందలో రోజుకు రెండు కంటే ఎక్కువనే గొర్రె పిల్లలు పుడుతుంటాయి.. వీరు తమ పిల్లల చదువులకు, ఇంటి ఖర్చులకు, ప్రయాణ ఖర్చులకు గొర్లను విక్రయిస్తుంటారు.

దొంగలతో ఇబ్బందులు

సాధారణంగా గ్రామాలకు దూరంగా ఉంటూ రాత్రి వేళల్లో గొర్రెల మందలను నిలుపుతారు. దొంగల బారి నుంచి రక్షించుకోవడానికి కుక్కలను తమ వెంట ఉంచుకుంటారు. అయినా చాలాసార్లు దొంగలతో ఇబ్బందులు పడుతుంటారు. దొంగల దాడిలో కాపరులు తీవ్రంగా గాయపడడం, కొన్నిసారు మృతి చెందిన సందర్భాలున్నాయి. ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు గొర్రెలతోనే ఉంటారు. వర్షం కురిస్తే గొర్ల మంద మధ్య గొంగళ్లు కప్పుకుని ఒక పక్కన పడుకుంటారు. బతుకు యాత్రల్లో ఎంతో మంది పాములు, తేళ్లు, గుండె పోటు, తదితర సమస్యలతో చని పోయిన సందర్భాలు ఉన్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- మల్యేపు లక్ష్మయ్య



మందలను మేపినప్పుడు కొన్ని గొర్రెల వ్యవసాయ భూ ముల్లోకి వెళ తాయి. పంట నష్టం జరిగిందంటూ రైతులు జరిమానా వేస్తారు. ఇది ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గొర్రెలకు మా ప్రాంతంలోనే మేత సౌకర్యం కల్పిస్తే ఈ సంచార జీవితం ఉండదు.

గొర్ల మందనే ఆధారం..

- మధుసూదన్



ఉన్న ఊరిలో సరైనా పని లేదు. వ్యవసాయం చేసుకుందామంటే నీళ్లు లేవు. డిగ్రీ చదివినా జీవనోపాధి లేదు. మాకు గొర్ల మందనే ప్రదాన జీవనాధారమైంది. మా ప్రాంతంలో మేతలేక గొర్లతో సంచారం చేస్తూ కుటుంబలను పోషించుకుంటున్నాం.

యువకుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన తొడుపునూరి సంతోష్(23) అనే యువకుడు కరీంనగర్ మారుతీనగర్‌లో అద్దెగదిలో శుక్రవారం రాత్రి ఉరికి వేలాడుతూ అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. కరీంనగర్ మూడోఠాణా సీఐ జాన్ రెడ్డి తెలిపినవివరాల ప్రకారం.. సంతోష్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు కరీంనగర్‌కు చెందిన ఓ యువతితో మూడేళ్లకిందట వివాహం జరిగింది. తరచుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. శుక్రవారం సాయంత్రం కూడా ఇద్దరిమధ్య గొడవ జరిగింది. అనంతరం సంతోష్ భార్య తన తల్లి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి రాత్రి సంతోష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సంతోష్ మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. సంతోష్‌మృతిపై అనుమానాలున్నాయని మృతుడితండ్రి లక్ష్మణ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

లారీకి విద్యుత్ తీగలు తగిలి ఒకరి మృతి



రమేశ్(ఫైల్)

మల్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాంపూర్ సమీపంలో కలప లోడ్‌తో వెళ్తున్న లారీకి శనివారం విద్యుత్‌తీగలు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి అందులో ఉన్న పారకొండ రమేశ్(52) అనే కూలీ మృతి చెందాడు. డ్రైవర్ లారీలో నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం రాంపూర్‌కుచెందిన రమేశ్ లారీలో కట్టెల లోడింగ్ చేయడానికి ఓబులాపూర్ గ్రామానికి వెళ్లాడు. లోడింగ్ పూర్తయి లారీలోనే తిరిగి వస్తుండగా రాంపూర్ గ్రామశివారులో లారీకి 11కేవీ విద్యుత్‌తీగలు తగిలాయి. ఆ సమయంలో వర్షం కురుస్తుండటంతో తడివల్ల లారీ మొత్తం విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ మహ్మద్ అబ్దుల్ అదునాన్ ఫైజల్ కుడి వైపు డోర్ నుంచి కిందకు దూకేశాడు. లారీలో కూర్చున్న రమేశ్ ఎడమ వైపు నుంచి కిందకు దిగే ప్రయత్నంలో ఇనుపడోరు పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఎక్స్‌కవేటర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

ఓదెల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాయమ్మపల్లి మెయిన్ రోడ్డుపై శనివారం ఎక్స్‌కవేటర్ బోల్తా పడింది. లారీపై ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళుతుండగా వాహనం పైనుంచి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కపొలంలో పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

నేలకొరిగిన వంద ఏళ్ల రావి వృక్షం

- తప్పిన పెను ప్రమాదం



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన రావి వృక్షం

వెల్గటూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో వంద ఏళ్లకు పైగా ఉన్న రావివృక్షం శనివారం కురిసిన వర్షానికి వేళ్లతో సహా నేల కొరిగింది. రావిచెట్టు వర్షానికి మెల్ల మెల్లగా నేలకొరగడం గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన వచ్చి చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లను తొలగించారు. దీనితో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు. వృక్షంపడే సమ యానికి గాలి వీయడంతో ఆలయం పక్కకు పడిందని, ఇదంతా ఆంజనేయస్వామి మహిమే అని స్థానికులు చర్చించుకుంటున్నారు. మొత్తానికి ఎలాంటి ప్రాణ,ఆస్తినష్టం జరుగకుండా ఏళ్లనాటి భారీవృక్షం పడిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్సై, కానిస్టేబుల్‌పై కేసు నమోదు

బోయిన్‌పల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌పై హెచ్‌ఆర్సీలో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోరెం గ్రామానికి చెందిన ఖ్యాతం అనురాధ, ఆమె భర్త తిరుపతిరెడ్డికి మరోవర్గం మధ్య భూవివాదం తలెత్తింది. రక్షణ కోసం అనురాధ గతనెల 27న పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేయాలంటే సదరుకానిస్టేబుల్ 25వేల రూపాయలు డిమాండ్ చేయగా, ముందుగా వేయిరూపాయలు ఆన్‌లైన్‌ద్వారా పంపించారు. మిగతా డబ్బులు ఇస్తేనే ఎస్ఐ కేసు నమోదు చేస్తా అంటున్నాడని అనురాధకు కానిస్టేబుల్ తెలిపాడు. దీంతో ఆమెభర్త తిరుపతిరెడ్డి హెచ్‌ఆర్సీని ఆశ్రయించి ఎస్ఐ, కానిస్టేబుల్‌తోపాటు మరో ముగ్గురిపై ఫిర్యాదు చేశాడు. తిరుపతిరెడ్డికి హెచ్‌ఆర్సీ నుంచి 1469-36-25-2025నంబర్‌తో ఫిర్యాదు రిజిష్టర్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ ద్వారా సమాచారం అందినట్లు విలేకరులకు తెలిపాడు. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు కానిస్టేబుల్ బదీలి అయినట్లు సమాచారం.

గోదావరి నదిలో మొసలి: భయాందోళనలో ప్రజలు



నదిలో రాళ్లపై మొసలి

ధర్మపురి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరినదిలో మొసలి సంచరిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో శనివారం వైరల్ అయ్యాయి. దీంతో నదినీటిలో స్నానాలు ఆచరించే భక్తులు భయాందోళన చెందుతున్నారు. గోదావరి నదిలో స్నానానికి వచ్చిన ఒక భక్తుడు నది నీటిలో నుండి బండరాయి పైకి పాకుతున్న మొసలిని తన సెల్ ఫోన్‌లో బంధించి సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. కొన్నిరోజుల నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు నదీ నీటి ప్రవాహం పెరిగి వరదల్లో మొసలి కొట్టుకువచ్చి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కొండగట్టు, ధర్మపురిలో భక్తుల రద్దీ



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు



ధర్మపురిలో స్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

మల్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి వారి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. శ్రావణమాసం మొదటిశనివారం కావడంతో వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులు అంజన్నతోపాటు బేతాళుడు, శ్రీరాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. కాగా అంజన్న సన్నిధిలో జరుగుతున్న శ్రావణసప్తాహ ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం ఆంజనేయస్వామి, అమ్మవారు, వెంకటేశ్వర స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంకాలం సేవా కార్యక్ర మాలు జరిపారు. ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానార్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: శ్రావణమాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మొదటి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రావిచెట్టు ఆంజనేయస్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జగిత్యాల క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల సమీపంలో టౌన్ ఎస్సై రవి కిరణ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన సయ్యద్ యూసుఫ్ అనే యువకుడు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. విచారణలో 150గ్రాముల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. యూసుఫ్‌పై కేసునమోదుచేసి గంజాయిని సీజ్ చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు.

- **భీమారం:** భీమారం గ్రామశివారులో ఇద్దరినుంచి గంజాయిని పట్టుకున్నట్లు మేడిపల్లి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. భీమారం గ్రామశివారులో బీహార్‌కు చెందిన బలరాం, దిల్కుష్‌లు అనుమానంగా కనిపించగా వారిని తనిఖీచేయగా 60 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన కొమురయ్య

మంథనిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో దండిగ కొమురయ్య(65) అనేరైతు శనివారం ఉదయం పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందాడు. భారీవర్షాల కారణంగా పొలం వద్ద పరిస్థితి గమనించేందుకు కొమురయ్య వెళ్లాడు. పొలం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్‌కు సరఫరా అయ్యే వైర్ తెగి స్తంభం ఎర్త్ వైర్‌పై పడింది. దీనిని గమనించని కొమురయ్య ఎర్త్‌వైర్‌కు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య గట్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మంథని ఆసుపత్రి పోస్టుమార్టం గది వద్ద మాజీఎమ్మెల్యే పుట్ట మధు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హుజూరాబాద్ హోటళ్లలో జంతువ్యర్థాల నూనె?

- పరకాల పోలీసులకు చిక్కిన నిందితులు

హుజూరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో ఎక్కడ చూసినా బిర్యానీసెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ఆయా బిర్యానీ సెంటర్లకు కల్తీ వనస్పతి(నూనె) సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా రెండురోజులక్రితం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో జంతువుల వ్యర్థాలతో వనస్పతి తయారుచేస్తున్న ముఠాను అక్కడి పోలీసులు పట్టుకున్నారు. వారు తయారు చేసిన వనస్పతిని హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలకు సరఫరా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ధర తక్కువ ఉండడంతో హోటళ్ల నిర్వాహకులు ఈ వనస్పతిని వాడుతున్నట్లు తెలిసింది. దీనిపై జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్, పోలీసులు బిర్యానీ సెంటర్లపై తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ హాస్టల్‌లో డీడీ విచారణ

హుజూరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలురహాస్టల్‌లో మద్యంసీసాలు లభించాయనే మేరకు శనివారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిఅధికారి నాగేశ్వర్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని మద్యం సీసాలపై సిబ్బందిని అడగగా, పూర్వ విద్యార్థి హాస్టల్‌లోకి మద్యం సీసాలు తీసుకొని రావడంతో వెంటనే తాము పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. బయట వ్యక్తులు హాస్టల్‌లోకి రాకుండా చూసుకోవాలని వార్డెన్‌ను హెచ్చరించారు. అనంతరం ఎస్సై యూనస్ అహ్మద్‌అలీ విచారణ చేపట్టారు.

వాహనం ఇక్కడ.. చలాన్ అక్కడ..

- అవాక్కైన వాహనదారుడు..

గంభీరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో వాహనం ఉంటే కరీంనగర్‌లో ట్రిపుల్‌రైడింగ్ పేరిట మొబైల్‌కు జరిమానాచలాన్ మెసేజ్ రావడంతో వాహనదారుడు అవాక్కయ్యాడు. గంభీరావుపేట కేజీటూపీజీ పాఠశాలలో శివకుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల23న రోజు మాదిరిగానే పాఠశాలకు శివకుమార్ హాజరయ్యాడు. కానీ అదే రోజు మధ్యాహ్నం కరీంనగర్‌లో శివకుమార్ ట్రిపుల్‌రైడ్ చేశాడని, రూ.1235 జరిమానా విధి స్తూ ఆయన మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. శివకుమార్ తన వాహనంతోపాటు గంభీరావుపేటలో ఉండగా, ట్రిపుల్‌రైడ్ కరీంనగర్‌లో చేసినట్టు మెసేజ్ రావడంతో అవాక్కయ్యాడు. ఈ విషయమై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని, తన వాహనం కాదని, ఆవాహనం నడుపుతున్న వారు ఎవరోతెలియదని ఫిర్యాదులో వివరించినా ఎవరూ పట్టించుకోవడం లేదని శివకుమార్ వాపోయాడు. స్టేట్ ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్‌రూం హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేస్తే స్పందనలేదని వెల్లడించాడు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తనకు న్యాయం చేయాలని శివకుమార్ కోరాడు.

కొండలరాయుడి కోటపై ధ్వజారోహణం



ప్రణవ ధ్వజం వద్ద ఆలయ ఈవో, అర్చకులు

మల్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వెనకాల వాయువ్య భాగం లోగల ఎంతో చారిత్రాత్మకమైన కొండల రాయుడి కోటపై దేవస్థానం అధికారులు శనివారం ధ్వజారోహణం చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా దేవస్థానం తరపున శ్రావణ మాసం మొదటి శనివారం విజయానికి ప్రతీక అయిన ప్రణవధ్వజం ఏర్పాటు చేశారు. ఇకపై ప్రతినెలా నూతన ప్రణవధ్వజం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయస్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు జితేందర్, ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, అర్చకులు లక్ష్మన్, అభిలాశ్ ఉన్నారు.

మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు

- ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో 47బస్సుల అప్పగింత



భగత్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థిక పరిపుష్టత కల్పించే విధంగా అడుగులు వేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా ద్వారా ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలుచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణాసంస్థ కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11డిపోలు కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, జగిత్యాల, కోరుట్ల, మంథని, మెట్‌పల్లి, సిరిసిల్ల వేములవాడ డిపోలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపోల ద్వారా మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి ఇస్తున్నది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో 47బస్సులను మహిళాసంఘాలకు అప్పగించింది. ఇందులో 10ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉండగా, 37పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. కరీంనగర్ రీజియన్‌లో సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించగా, ప్రస్తుతం మహిళా సంఘాలకు బస్సులను కేటాయించి మహిళలను ఆర్థిక రంగంలో నిలదొక్కుకునేలా బస్సులను కొనుగోలు చేసి వారికి మంచి రూట్లలో బస్సులను నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మహిళా సంఘాలు సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను రాష్ట్ర మంత్రులు పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కరీంనగర్ ఆర్టీసీ రీజియన్‌లో పలు డిపోల ద్వారా బస్సులను కొనుగోలు చేసి మహిళా సంఘాలకు ప్రభుత్వం బస్సులను కేటాయిస్తుండడంతో మహిళా సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ రీజియన్‌లో సెర్ప్ బస్సుల వివరాలు

డిపో	ఎక్స్‌ప్రెస్‌లు	పల్లెవెలుగు	మొత్తం
గోదావరిఖని	3	3	6
హుస్నాబాద్	1	5	6
హుజూరాబాద్	1	5	6
జగిత్యాల	2	5	7
కరీంనగర్-1	0	3	3
కోరుట్ల	1	2	3
మంథని	1	3	4
మెట్‌పల్లి	0	5	5
సిరిసిల్ల	1	2	3
వేములవాడ	0	4	4
మొత్తం	10	37	47

సందడిగా రాయికల్ జలపాతం



రాయికల్ జలపాతం వద్ద సందర్శకుల సందడి

సైదాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాయికల్ జలపాతం శనివారం సందర్శకులతో సందడిగా మారింది. వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తుండడంతో ఇతర జిల్లాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో రావడంతో జలపాతం ప్రాంతం వాహనాలతో నిండిపోయింది. రోడ్డు బురదగా ఉన్నా.. వర్షం కురుస్తున్నా.. లెక్క చేకుండా సందర్శకులు జలపాతం సందర్శనకు వస్తున్నారు. జలపాతం వద్ద సందర్శకులు మద్యం సేవిస్తున్నారనే సమాచారం మేరకు సైదాపూర్ ఎస్సై తిరుపతి జలపాతం రోడ్డులో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సందర్శకులు మద్యం సేవించి ప్రమాదాలకు గురి కావద్దన్నారు.

పైడి జయరాజ్ స్మారక పురస్కారానికి..
పొన్నం రవిచంద్ర ఎంపిక



పొన్నం రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే తెలంగాణ సన్మాన్-2025 పురస్కారాల్లో భాగంగా పైడి జయరాజ్ స్మారక పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్ర ఎంపికైనట్లు ఛైర్మన్ నారగోని పురుషోత్తం ఒకప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారాన్ని రవిచంద్ర స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కవులు, కళాకారులు, నగరవాసులు అభినందనలు తెలిపారు.



పెళ్లి కాని యువతులు జరుపుకునే సంబురం

- తొమ్మిది రోజుల పాటు ఆటపాటలు
- శ్రావణంలో ప్రత్యేక వేడుక
- తండాల్లో సందడి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పచ్చని అటవీ ప్రాంతాల్లో.. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రాణం ఇచ్చే గిరిజనులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో శ్రావణ మాసం చివరివరకు జరిగే తీజ్ సంబరాలకు సిద్ధమయ్యారు. తీజ్ ఉత్సవాలకు తండాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. వర్షాలు మొదలవడంతోనే లంబాడీలు శీతల్, తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. బతుకమ్మ పండగ తరహాలోనే సాగిపోయే తీజ్ ఉత్సవాలు వారి సంప్రదాయాలకు అద్దం పడుతుంది. లంబాడీలు తమ భాష, ఆచార వ్యవహారాలను సజీవంగా ఉంచుకోవడానికి తపన పడుతూనే ఉన్నారు. చాలా ప్రాంతాల్లో లంబాడి మహిళలు కట్టు బొట్టు విషయంలో పద్ధతులు మాత్రం వీడడం లేదు. ఆచార వ్యవహారాలను ఆరాధించే లంబాడీలు, బంజారాలు తీజ్ వంటి వ్యవసాయ పండుగలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

● బతుకమ్మ తరహాలోనే తీజ్ ఉత్సవం..

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగలాగే తీజ్ పండుగను జరుపుకుంటారు. తీజ్ అంటే పచ్చని పంట లేదా నారుగా అర్థం వస్తుంది. తీజ్ బంజారాల మాతృదేవత మేరామాకు ప్రతిరూపంగా విశ్వసిస్తారు. బంజారాల సంస్కృతిలో ఏడుగురు మాతృదేవతలు ఉంటారు. వారిలో మేరా పెద్దది. ఆమె పైరు పంటలను రక్షిస్తుందని వర్షాలు కురిసి వేసిన పంటలు పుష్కలంగా పండి ధాన్యం ఇంటికి వస్తుందని భావిస్తారు. పచ్చని నారును మేరమా రూపంగా మలచి పండుగగా జరుపుకుంటారు. తొలకరి చినుకులు కురిసిన తరువాత తండా ప్రజలు అదును చూసి విత్తనాలు వేస్తారు. పచ్చగా పెరుగుతున్న పంటను చూసి తండా ప్రజలు తీజ్ ఉత్సవాన్ని జరుపుతారు. పంట ఏపుగా పెరిగే నాటికి జూలై చివరి నుంచి ఆగస్టు మాసం చివరి వరకు ఈ పండుగ



తీజ్ ఉత్సవాల్లో మహిళలు (ఫైల్)

నిర్వహిస్తారు. బంజారాలు భూమిని పంటను దేవత రూపంగానే భావిస్తారు. తండా పెద్ద అనుమతితో ముత్తైదువలు సూత్రదారులుగా బంజారా యువతులతో పండుగ నిర్వహిస్తారు.

● ఉప్పు, కారం లేని ఆహారం..

తీజ్ బుట్టల తయారీ నుంచి గోధుమ నారును చెరువులో వదిలివేసే వరకు యువతులు ఉప్పు, కారం లేని ఆహారాన్ని భుజిస్తూ దీక్షగా ఉంటారు. బంజారాలు రోజంతా వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం వేల తీజ్ దగ్గరకు చేరి భక్తి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. 7వ రోజున సేవాలాల్‌కు శాఖహార నైవేద్యాన్ని సమర్పిస్తే, మేరామా దేవత మాంసహార నైవేద్యాన్ని స్వీకరిస్తుంది. ప్రతి కుటుంబం కొంచం బియ్యం పిండిని దీక్షలో ఉన్న యువతులకు పంపిస్తారు. పిండి, బెల్లం కలిపి యువతులు తీజ్ దగ్గరే నైవేద్యాన్ని తయారుచేస్తారు. దీన్ని బుజ్కా లాప్సీ అంటారు. ఈ పదార్థాన్ని నెయ్యితో కలిపి మంటలో వేస్తారు. బియ్యం పిండితో రోట్టె చేసి బెల్లంతో కలిపి ముద్ద చేస్తారు. దీన్ని చుర్మో అంటారు. మేరామా సేవాలాల్ పెళ్లి కూడా 9వ రోజు ఘనంగా జరుపుతారు. గణ్ అంటే భార్య గోర్ అంటే భర్త గణ్‌గోర్ ఉత్సవంగా జరుపుతారు. సాంప్రదాయంగా అలంకరించి పెళ్లి జరిపిస్తారు. దేవతలకు నైవేద్యం సమర్పించగానే మంచెమీద ఉన్న బుట్టలను అన్నదమ్ములు తీసుకొని పరుగుతీస్తారు. వారి వెంట అక్కచెల్లెల్లు, అన్నదమ్ములు కూడా పరుగు తీస్తారు. బుట్టలోని నారు ఏమీ చెయ్యవద్దని తమకు ఇవ్వమంటూ వేడుకునే కార్యక్రమం నిర్వహిస్తారు. దేవతకు ప్రతిరూపాలైన చిన్న బుట్టలను చిందరవందర చేస్తే శోకభరిత గీతాలను అలపిస్తారు. ఇలా అనేక విధాలుగా ఉత్సవాన్ని కొనసాగిస్తారు. తొమ్మిదో రోజున గోదుమ నారును చెరువులో వదులుతారు. చిన్నపీట మీద అన్నదమ్ములు అక్కచెళ్లల్ల కాళ్లు కగిడి తమ ప్రేమానురాగాలను ప్రకటిస్తారు. అన్నదమ్ములు, అక్కాచెళ్లెళ్లకు అనుబంధంగా పాటలు పాడుకుంటారు. తీజ్ ఉత్సవంలో పాల్గొనే అమ్మాయిలకు మంచి భర్తలు వస్తారని, మంచి కాపురం ఉంటుందని కూడా భావిస్తారు.

● నాలుగు దశల్లో పండగలు...

తొమ్మిది రోజులు నాలుగు దశలుగా పండుగను నిర్వహిస్తారు. మొదటిది బుట్టలలో గోదుమలను చల్లుతారు. దీన్ని తీజ్ బోరా యేరో అంటారు. రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం. మూడవది గణ్ గోర్ అంటే మేరామా సేవాలాల్‌ల పెళ్లి. నాలుగవది గోదుమ నారను చెరువులో వదులుతారు. వేరా యేరోగా పిలుస్తారు. బంజారా యువతులు గోదుమలు కొని సారవంతమైన మట్టిని తీసుకొచ్చి బావి దగ్గర నుంచి శుభ్రమైన నీటిని తెచ్చి పాటలు పాడుకుంటూ గోదుమలను నానబెడుతారు. పెద్దలు తీజ్ బుట్టలను తయారుచేసి ఇస్తారు. గోదుమలు నానబెట్టి బాటిని బుట్టల్లో వేసి యువతులు నృత్యాలతో పాటలు పాడుతూ వెళుతారు. యువతులు గోదుమలు నానబెట్టి బుట్టలో వేసే పనిలో ఉంటే వారి అన్నదమ్ములు మంచె వేస్తారు. కింద ఉంటే నారును పశువులు తింటాయని ఎత్తుగా ఈ మంచె తయారుచేస్తారు. పెద్ద బుట్టను ఒక దాన్ని ఏర్పాటు చేసి మిగిలినవి చిన్న బుట్టలను ఉంచుతారు. నారు ఏపుగా పెరగడానికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం క్రమం తప్పకుండా నీళ్ల పోస్తారు. ఈ సమయంలో పాటలు పాడుతారు.

అత్యుత్తమ ఆవిష్కరణకు అవార్డు

- ఈనెల 29 ఢిల్లీలో అందజేయనున్న ప్రధానమంత్రి
- నేడు బయలుదేరి వెళ్లనున్న దమ్మన్నపేట విద్యార్థులు



ఢిల్లీలో అవార్డు అందుకోనున్న విద్యార్థులు

గంబీరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ఆవిష్కరణల అవార్డు తీసుకునేందుకు దమ్మన్నపేట హైస్కూల్ విద్యార్థులు ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సహకారంతో హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీ వెళ్లనున్నారు. విద్యార్థులు గైడ్ టీచర్ సంపత్ కుమార్‌తో కలిసి ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో ఈనెల29న నిర్వహించనున్న ప్రోగ్రాంలో ఆవిష్కరణను ప్రదర్శించి ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా ఆవిష్కణల అవార్డును అందుకోనున్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యూకేషన్ న్యూఢిల్లీ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025 వైజ్ఞానిక ప్రదర్శనలో గంబీరావుపేట మండలం దమ్మన్నపేట హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు మాలోత్ సుప్రియ, ఈరబోయిన శ్రీచైత్ర, ఈరబోయిన మధుప్రియ గైడ్ టీచర్ తాడూరు కరుణాకర్ మార్గదర్శనంలో తయారు చేసిన స్మార్ట్ వాష్ బేసిన్ అనే ఆవిష్కరణ ఎంపికైంది. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ వీరిని అభినందిస్తూ వీరి ప్రయాణ ఖర్చులో భాగంగా విమాన టికెట్‌ను అందజేశారు.

'శాతవాహన'ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

గణేశ్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయాన్ని అత్యున్నతస్థాయికి తీసుకెళ్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో పరిపాలన భవన మొదటిఅంతస్తులో పరీక్షల విభాగం కోసం నిర్మించిన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అంతర్గత నీటిసరఫరా పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనతోపాటు ఆధునీకరించిన సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో 240సీట్లకు 160సీట్లు భర్తీ అయ్యాయన్నారు. విశ్వవిద్యాలయ లా కాలేజీలో, ఫార్మసీకళాశాలలో ఎం ఫార్మసీ కోర్సులో ఈ విద్యాసంవత్సరానికి సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈసారి శాతవాహన ఉత్సవాలు ఘనంగా జరుపుకుందామన్నారు. అనంతరం వీసీ ఆచార్య ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి మంత్రి పొన్నంప్రభాకర్ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారన్నారు. త్వరలో న్యాయకళాశాలను 18కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్టీఏసభ్యుడు పడాలరాహుల్, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తీ రవికుమార్, అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ, మున్సిపల్‌కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్ట్సకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, ఓఎస్డీ టువీసీ హరికాంత్, పరీక్షల నియంత్రణాధికారి సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.

● సామాజిక న్యాయకల్పనలో కాంగ్రెస్ చాంపియన్..

కరీంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజలకుసామాజిక న్యాయం చేయడంలో కాంగ్రెస్ పార్టీ చాంపియన్ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో మంత్రి మాట్లాడుతూ బీజేపీ బీసీలకు కనీసం శాసనసభ పక్ష నాయకుడి పదవిని కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బలహీన వర్గాలలకు చెందిన బండి సంజయ్‌ని అకారణంగా తొలగించి, అగ్రవర్ణాల వారిని నియమించిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కరుడుగట్టిన బడుగు బలహీన వర్గాల వ్యతిరేకి రామచంద్రరావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని చేశారని మంత్రి విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముందుగా తన మంత్రి పదవికి రాజీనామా చేసి అర్వింద్, ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్యలో ఒకరికి ఇవ్వాలన్నారు. బీజేపీ బీసీలకు మంత్రి పదవి ఇచ్చిన తర్వాత కాంగ్రెస్‌ను ప్రశ్నించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే అడ్డంపడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ చేస్తున్న కుట్రలను బలహీన వర్గాలు చూస్తూ ఊరుకోవన్నారు. బలహీన వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు రాష్ట్రపతివద్ద ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు బిల్లును ఆమోదింపజేయాలన్నారు. బిల్లు ఆమోదింపజేసి కోర్టు చెప్పిన విధంగా సెప్టెంబరు 30లోపు ఎన్నికలు నిర్వహించడానికి బీజేపీ తమప్రభుత్వానికి సహకరించాలన్నారు.



పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి ప్రవాహం

● కడెం ప్రాజెక్టు రెండు గేట్లు తెరచి నీటి విడుదల



ధర్మపురి వద్ద ప్రవహిస్తున్న గోదావరి నది వరద

ధర్మపురి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం శనివారం పెరిగింది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం 5 గంటల వరకు కడెం ప్రాజెక్టులోనికి 10,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 2, 18వ నంబర్ గేట్లు తెరచి ఉంచడం వల్ల 10,300 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగడ్డె ఆనుకుని నీటి ప్రవాహం కొనసాగుతోంది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ అప్రమత్తం చేశారు. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్ అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 7,500 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు రావడం పెరిగింది. డ్యామ్‌లోకి ఉదయం 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా క్రమంగా పెరుగుతూ రాత్రి 9 గంటల వరకు 7,500 క్యూసెక్కులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 22.053 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 25.960 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 622 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 11.744 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 2.991 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

పోటాపోటీగా సీబీఎస్‌ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు

● పాల్గొంటున్న 800 మంది క్రీడాకారులు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ క్లస్టర్-7 కబడ్డీ బాలుర కబడ్డీపోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జగిత్యాలరోడ్ వివేకానంద సీబీఎస్‌ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన ఈ పోటీలలో రెండోరోజు శనివారం అండర్-17,-19విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. రెండోరోజు పోటీలను వివేకానంద అకాడమిక్ డైరెక్టర్ లలితకుమారి క్రీడాకారులనుపరిచయం చేసుకుని ప్రారంభించారు. పోటీల నిర్వహణలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ టెక్నికల్ అఫీషియల్స్‌తోపాటు కరీంనగర్ జిల్లాకబడ్డీ అసోసియేషన్ అఫీషియల్స్ పాల్గొంటున్నారు.

● నేడు పోటీల ముగింపు ఉత్సవం..

సీబీఎస్‌ఈ క్లస్టర్-7కబడ్డీ పోటీల ముగింపుఉత్సవాన్ని ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్‌కమిషనర్ గౌస్‌ఆలం, కరీంనగర్ జిల్లాకబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ వెలిచాల రాజేందర్‌రావులతోపాటు జిల్లా అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్, సీహెచ్ సంపత్‌రావు, బి మల్లేశ్‌గౌడ్, పోటీ అబ్జర్వర్ ఎల్ వెంకటరమణ, ఎన్ లక్ష్మీనారాయణ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హుజూరాబాద్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

హుజూరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌కు చెందిన క్రీడాకారులు కాశిరెడ్డి గౌతమ్‌రెడ్డి, మేకల ప్రభాత్‌విష్ణువర్ధన్, వేల్పుల రమ్య జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సారయ్య, సెక్రెటరీ తిరుపతిగౌడ్, జాయింట్ సెక్రెటరీ అంజయ్య శనివారం తెలిపారు. ఈనెల 13న తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్‌కబడ్డీ పోటీల్లో గౌతమ్‌రెడ్డి, ప్రభాత్‌విష్ణువర్ధన్, రమ్య పాల్గొని ప్రతిభకనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 25,26,27,28వ తేదీల్లో చండీఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల సీనియర్ క్రీడాకారులు, పలువురు అభినందించారు.

నవోదయలో రీజినల్ స్థాయి ఖోఖో పోటీలు

చొప్పదండి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల29నుంచి31వరకు రీజనల్‌స్థాయి ఖోఖోపోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒకప్రకటనలో తెలిపారు. దక్షిణభారతదేశంలోని నవోదయవిద్యాలయాలనుంచి క్రీడాకారులు ఈ పోటీల్లోపాల్గొంటారని, మూడురోజులపాటు ఈపోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్టు

ముస్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రానికిచెందిన ఓయువకుడు గంజాయికేసులో శనివారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపినవివరాల ప్రకారం.. ముస్తాబా ద్‌కు చెందిన మందాటి చందు(22) తనస్నేహితుడు మనోజ్ దగ్గర గంజాయిని కొని కొంతతాగాడు. మిగిలిన గంజాయిని అమ్మేందుకు ముస్తాబాద్ శివారులోకి రాగా పక్కాసమాచారం మేరకు పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతనివద్దనుంచి 102గ్రాముల గంజాయి, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చందును అరెస్టుచేసి రిమాండ్‌కుపంపినట్లుఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు..

- పిల్లలకు అన్ని రంగాల్లో చేయూత
- నేడు పేరెంట్స్ డే

కరీంనగర్ కల్చరల్, సిరిసిల్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలుగా భావిస్తాం. లోకంలో తల్లిదండ్రులను మించిన దేవుళ్ల లేరు. తల్లి జన్మనిస్తే, తండ్రి లోక జ్ఞానం నేర్పిస్తాడు. ప్రతీ వ్యక్తి జీవితంలో తల్లి ప్రేమ, తండ్రి ఆదర్శం, గురువు ప్రేరణ తప్పనిసరి అవసరం. కానీ మారుతున్న కాలంలో రెక్కలు వచ్చిన పక్షులుగా తల్లిదండ్రులను వదలి దూరతీరాలకు ఎగిరిపోతున్న పిల్లలు కూడా ఉన్నారు. తమ పిల్లల కోసం ప్రతీది చేసే తల్లిదండ్రులకు కృతజ్ఞతలు, గౌరవం ఇవ్వడానికి ప్రతి యేటా జూలై నాలుగో ఆదివారం రోజు తల్లిదండ్రుల దినోత్సవం జరుపుకుంటారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లలో పిల్లలకు మార్గనిర్దేశనం చేయడంలో తల్లిదండ్రుల ప్రేమ, మద్దతు కీలకం. అందుకు పిల్లలు తల్లింద్రులతో పాటు తల్లిదండ్రుల లాంటి వ్యక్తులకు కృతజ్ఞత, ఆప్యాయత వ్యక్తం చేయడానికి ఈ రోజు ఒక గుర్తు.

● నేపథ్యం....

తల్లిదండ్రులను సదా గౌరవిస్తూ ప్రేమిస్తూ వారి బాగోగులు జీవిత చరమాంకం వరకు చూసుకోవాలనే ఉద్దేశ్యంతో 1994లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ జూలై నాలుగో ఆదివారాన్ని తల్లిదండ్రులను గౌరవించే రోజుగా ప్రకటిస్తూ తీర్మానంపై సంతకం చేశారు.

● పరస్పర ప్రేమలు- నాడు-నేడు...

నాడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, క్రమశిక్షణ, విలువలు, ప్రేమలు, బంధాలు-అనుబంధాలు, ఆప్యాయత ఉండడంతో తల్లిదండ్రులతో పిల్లలు, పిల్లలతో తల్లిదండ్రులు పరస్పరం కలసి మెలసి ఆనందంగా జీవించేవారు. ప్రస్తుతం తల్లిదండ్రులకు సంతానానికి మధ్య ఏదో తెలియని తెరలు అడ్డుపడుతున్నాయి. కుటుంబాల మధ్య సుహృద్భావం కరువైంది. ఒకే చోట అందరూ కలసి సహజీవనం చేసే సౌభాగ్యమే లేకుండా పోయింది. తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోలేక అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు.



● పిల్లలు చేయాల్సింది....

ఎన్నో కష్టాలకు ఓర్చి తమ కోరికలను సైతం వదలి పిల్లల విజయాలను చూసి మురిసిపోయే తల్లిదండ్రులకు ఈ దినోత్సవం నుంచి అయినా వారితో ఆనందంగా గడపడానికి ప్రయత్నించాలి. తల్లిదండ్రులు పిల్లలపై చూపే ప్రేమ, శ్రద్ధ, ఎదుగుదలలో చూపే అలుపెరుగని ఆప్యాయతలకు ప్రత్యమ్నాయం లేదు. పిల్లలు ఎదిగిన తర్వాత తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాలి. వారి అవసరాలను తీర్చాలి. అమ్మానాన్నల రుణం తీర్చుకునే ప్రయత్నం చేయాలి.

ముసురు వాన..

(5వ పేజీ తరువాయి)

నీరు నిల్వఉంది. జిల్లాలో శనివారం ఉదయం వరకు సగటు వర్షపాతం 25.9 మిల్లీ మీటర్లు నమోదైంది. శనివారం ఉదయంనుంచి సాయంత్రం వరకు రుద్రంగిలో 45.0 మిల్లీ మీటర్లు, గంభీరావుపేటలో 38.8 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 37.8, వేములవాడ రూరల్‌లో 36.3, ఇల్లంతకుంటలో 32.3, చందుర్తిలో 31.3, బోయిన్‌పల్లిలో31.2, సిరిసిల్లలో 22.5, తంగళ్ళపల్లిలో 29.3, ఎల్లారెడ్డిపేటలో 21.3, వీర్నపల్లిలో 18.5, కోనరావుపేటలో 21.5 వేములవాడలో 22.3 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

బాధితురాలికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన వడ్నాల రామలక్ష్మి పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలడంతో ప్రభుత్వం నుంచి వచ్చే తక్షణ సహాయం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నందు గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎక్కల దేవి శ్రీనివాస్, 4500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలి

కోనరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన అంబులెన్స్ అందుబాటులో ఉండటం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. కోనరావుపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోనరావుపేటలో 108 అంబులెన్స్ అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. దీనివల్ల రాత్రిపూట ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 30 కిలో మీటర్లు దూరం ఉంటుందని అన్నారు. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే గంట సమయం తీసుకున్నా రావడం లేదన్నారు. అందుకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన అంబులెన్స్ మండల కేంద్రంలోని ఉండాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సురేష్‌గౌడ్, గంగాధర్, జింక వెంకటి, మోత్కు మోహన్, వెంకటేశం, పరశురాం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నిర్లక్ష్యం

ఇల్లంతకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులలో గత ప్రభుత్వ హయాంలో ప్రసవాలు పెరిగితే నేడు ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకోవడం లేదని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు, ముస్కానిపేట గ్రామాలలో శనివారం కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే ఆడబిడ్డ పుడితే 13వేలు, మగబిడ్డ పుడితే రూ 12వేలతో పాటు తల్లి,శిశవుకు అవసరమే వస్తువులతో కూడిని కేసీఆర్ కిట్టును ప్రభుత్వం అందిచేదన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, కెమసారం తిరుపతి, మాజీ ఎంపీటీసీ సావనపెల్లి వనజఅనీల్‌కుమార్, పట్నం అశ్వినీశ్రీనివాస్, నాయకులు సాదుల్, రాగటి రమేష్, కదురు శేఖర్, గుర్రం తిరుపతిరెడ్డి,, సిద్దం నర్సయ్య, గుంటి మధు, తిరుపతిరెడ్డి లింగంపల్లి బాబు, పొనవేని గౌతమ్, సిరవేని స్వామి, పున్నం భూమయ్య, అనీల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు..

- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఇల్లంతకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. పైలెట్ గ్రామంగా సిరికొండను గుర్తించారు. ఇంటి భూమిపూజ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. తొలివిడతలో మండలానికి 850 ఇళ్లను మంజూరుచేశారు. వీటిలో ఇప్పటివరకు 490 నిర్మాణాలు ప్రారంభం అయి వివిధ దశల్లో ఉన్నాయి. మండలంలోని రేపాక, నర్సక్కపేట, పొత్తూరు, పెద్దలింగాపూర్ గ్రామాలలోని 40 మంది లబ్ధిదారుల ఖాతాల్లో మొదటి విడత డబ్బులు జమ అయ్యాయి. మిగతా వారికి త్వరలోనే జమ అవుతాయని ఏఈ శ్రీజ తెలిపారు. అయితే ఇసుక అధిక ధరకు కొనాల్సి వస్తోందని, స్టీలు, సిమెంట్ ధరలు పెంచుతున్నారని, దీనివల్లనే పనులు ఆలస్యం అవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పైలెట్ గ్రామం సిరికొండలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడక సాగుతున్నాయి. గ్రామానికి 45 ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 26 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కొంతమంది మంచి రోజులు లేకపోవడం వల్ల పనులు ప్రారంభించడం లేదని పేర్కొంటుండగా, మరికొంత మంది ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపడం లేదు.



సిరికొండలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఆనందంగా ఉంది..

- తడిసిన శిరీష, సిరికొండ



అనేక సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న స్వంత ఇంటి కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తా. ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతున్నందున ప్రభుత్వం ఇచ్చే డబ్బులు కొంత పెంచితే బాగుటుంది.

డబ్బులు జమ అయ్యాయి..

- మాసం మౌనిక, రేపాక



ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం చేపట్టాను. బెస్మెంట్ వరకు పూర్తి అవ్వడంతో బ్యాంకు ఖాతాలో రూ లక్ష జమ అయ్యాయి. బరంతి నింపడానికి మట్టి దొరకడం లేదు. ప్రభుత్వం ధరలను నియంత్రిస్తే సౌలభ్యంగా ఉంటుంది. ఇంటి నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉంది.

ధరలను పెంచితే చర్యలు..

- ఫారూఖ్, ఇల్లంతకుంట తహసీల్దార్



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్ద అధిక డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం. ఇసుక ట్రాక్టర్ టిప్పునకు రూ.1500మాత్రమే ఇవ్వాలి. ఎవరైన ఎక్కువ అడిగితే ఫిర్యాదు చేయాలి. మట్టికోసం దరఖాస్తు చేసుకోవాలి. ఏగ్రామంలోనైన ఇబ్బంది ఉంటే సమాచారం ఇవ్వాలి.

ఎగువ మానేరులోకి భారీగా వరద నీరు



జలకళను సంతరించుకున్న నర్మాల ఎగువ మానేరు జలాశయం



వేములవాడ మూలవాగులో అలుగు దూకుతున్న చెక్‌డ్యామ్

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. పలుచోట్ల చెరువులు మత్తడి దుంకుతున్నాయి. ఎగువన కరుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టుల్లో వరద నీరు వచ్చి చేరుతోంది.

గంభీరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మానేరులోకి వరదనీరు వస్తోంది. ఎగువ ప్రాంతంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పల్వంచవాగు పొంగిపొర్లుతోంది. భారీగా వరద నీరు వస్తుండటంతో ఎగువ మానేరు జలాశయం నీటి మట్టం 22 ఫీట్లకు చేరింది. మానేరు నిండటానికి మరో 9 ఫీట్ల నీరు కావల్సిఉంది. మానేరు నిండుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

కాగా, గంభీరావుపేట తాళ్ల ఎల్లమ్మ సమీపాన ఉన్న చెక్ డ్యాం మత్తడి దూకుతోంది. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా మానేరు వాగు నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. వరదనీటి ప్రవాహంతో తాళ్ళ ఎల్లమ్మ సమీపాన చెక్‌డ్యాం మత్తడి మీదుగా పరవళ్ళు తొక్కుతోంది.

గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ చింతల చెరువు మత్తడి దూకుతోంది. ఎగువప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు చింతల చెరువు నిండింది. దీంతో మత్తడి దూకుతోంది.

ప్రమాదకరంగా లింగన్నపేట రోడ్డు

గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగులో నిర్మించిన మట్టి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఎగువ మానేరు మత్తడి దూకిన ప్రతిసారీ లోలెవల్ బ్రిడ్జి మునిగిపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ఈ ప్రాంత నాయకులు, ప్రజల విన్నపాల మేరకు హైలెవల్ బ్రిడ్జి మంజూరైంది. మానేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో బాగంగా పాత లోలెవల్ బ్రిడ్జిని కాంట్రాక్టర్ కూల్చేశారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారి ఇదే కావడంతో వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా మట్టి రోడ్డును కాంట్రాక్టర్ నిర్మించారు. గత ఏడాది వర్షాకాలంలో ఎగువ మానేరు మత్తడి దూకడంతో తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. తిరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో కలెక్టర్ వచ్చి పరిశీలించి, త్వరగా మట్టి రోడ్డును వేయించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యంపై జరుగుతూ వస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మానేరు వాగు ప్రవహిస్తోంది. వరద నీటి ప్రవాహానికి లింగన్న పేట వాగు రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారిం ది. వరద ప్రవాహం ఉధృతమైతే రోడ్డు మళ్లీ కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. మరోవైపు మానేరు నీటి మట్టం పెరుగుతోంది. మానేరు మత్తడి దూకినా లింగ న్నపేట రోడ్డు కొట్టుకుపోతుంది. దీంతో ఈ మార్గం గుండా వాహణాల రాకపోకలు మళ్లీ నిలిచిపోయే అవ కాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన మూలవాగు ప్రవాహం..

వేములవాడ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ, మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ప్రవాహం శనివారం పెరిగింది. పట్టణంలోని మల్లారం రోడ్డులో గల కట్టుకాలువ ప్రవాహం పెరిగి మూలవాగులో కలుస్తుంది. తిప్పాపూర్ గ్రామ శివారులోని మారుపాక నుంచి వచ్చే కట్టుకాలువా ఉధృతంగా ప్రవహిస్తూ మూలవాగులో కలుస్తుంది. దీంతో ప్రవాహం ఎక్కువ కావడంతో చెక్‌డ్యామ్‌లు అలుగు దూకుతూ ఆహ్లాదకరంగా కనువిందు చేస్తున్నాయి.



ప్రమాదకరంగా మారిన లింగన్నపేట రోడ్డు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నెహ్రూనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఉచితంగా టై, బెల్టులు, గుర్తింపు కార్డులను విద్యార్థులందరికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ మాట్లాడారు. అనంతరం కొక్కుల అనీల విద్యార్థులందరికి అరటి పండ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తికొండ రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాస్‌రావు, కోడం భారతి, ఎండీ సలావుద్దీన్, అడుప కీర్తి, ఇప్పకాయల ప్రకాష్, విశ్వనాథుల శరత్‌బాబు. ఎం గంగారాం, కరుణశ్రీ, పద్మ, బొడ్డు శ్రీనివాస్, రాధకిషన్, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ఇల్లంతకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్తూరు గ్రామంలోని పనిచేసి బదిలీపై వెలుతున్న పంచాయితీ కార్యదర్శి బోనోతు శ్రీనివాస్‌ను జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు సన్మానించారు. గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడానికి కృషిచేశాడన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడటానికి ప్రాధాన్యత ఇచ్చాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని శ్రీనివాస్, నాయకులు కదురు శేఖర్, సిద్దం నర్సయ్య, ఆకుల తిరుపతి, మల్లేశం, పట్నం మహేందర్, బండారి మహేష్చ కర్ణాకర్‌రెడ్డి, నవీన్, రాగటి రమేష్, గుంటి మధు తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా కూలిన ఇల్లు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వానకు గుండం శ్రీనివాస్‌కు చెందిన పెంకుటిల్లు గోడ శనివారం పాక్షికంగా కూలింది. ఇంటి గోడ కూలిన సమయంలో ఎవరూలేకపోవడంతో ప్రాణపాయం తప్పిందని పేర్కొన్నారు. పాక్షికంగా కూలిన పెంకుటిల్లును కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్ని బాబు, ద్యాగం నారాయణ, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చాగౌడ్ పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళుతామని హామీ ఇచ్చారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతి ఈవో ప్రవీణ్ కూలిన ఇంటి గోడను సిబ్బందితో కలిసి పరిశీలించారు.

శిక్షణ తరగతులకు తరలివెళ్లిన బీఆర్ఎస్వీ శ్రేణులు

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఉప్పల్ పరిధిలోని మల్లాపూర్ డివిజన్‌లోని వీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తల శిక్షణ తరగతులకు జిల్లా కేంద్రం నుండి బీఆర్ఎస్వీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెల్లారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి దాదాపు 30మంది బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లారు. వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సబ్బని హరీష్, జిల్లా అధ్యక్షుడు అరుణ్, పట్టణ అధ్యక్షుడు మెట్టెల సాయిదీపక్, జిల్లా నాయకులు కనుకుంట్ల వెంకటరమణ, వల్లబోజు రమణాచారి, రాచమల్లు మోహన్, శివరాత్రి భరత్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వన మహోత్సవం

ముస్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ అంజయ్య అధ్యాపకులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యపకులు మురళి, సుంచు రాజు, నర్సింలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో రెయిన్ డే

చందుర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వర్షంలో ఉత్సాహంగా రెయిన్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల కాగితపు పడవలు చేసి నీటిలో వదులుతూ, గొడుగులు తిప్పుతూ ఆనందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వర్షపు నీరును ఏవిధంగా నిల్వ చేసుకోవాలి, వాగులు, నదులు, చెరువులను ఏవిధంగా సంరక్షించుకోవాలి, తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భార్గవి, రామస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారులపై గ్రామస్థుల అసహనం

కోనరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయం ఆవరణలో వర్షపు నీరు నిలిచి బురద మయంగా మారుతుంది. ఆలయానికి వచ్చే భక్తులు, గ్రామస్థులు మురికి నీరుతో ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లక రోడ్డుపైన నిలిచి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకొని ఆలయం ఎదుట మురికి నీరు నిలవకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ దివస్

చందుర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొవ్వొత్తులతో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు ముఖేష్ మాట్లాడుతూ జూన్ 26న పాకిస్తాన్ సైనికులను తిప్పికొట్టడంలో భారత్ సైనికులు విజయం సాధించడంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

వేములవాడ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై యూత్ కాంగ్రెస్ నాయకులు వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వెంట చిట్ల శ్రీనివాస్, నక్క సాయి, గసికంటి అశోక్, సందెల శశి, షేక్ ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రేవంత్ మిత్రమండలి అధ్యక్షులు గూడ విజయ్‌రెడ్డి శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన వెంట సోషల్ మిడియా నాయకులు ఇలియాస్ బాబా, సాయిప్రేమ్, రాజేష్, తేజ, షాకీర్, శ్రీకాంత్, హరికృష్ణలు ఉన్నారు.

పలువురికి పరామర్శ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం ఆంద్ర బుచ్చయ్య, నేవూరి అమృత అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. నారాయణపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ షాదుల్లా కంటికి శస్త్రచికిత్స చేసుకోగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు నర్సింలు, మజీద్, నర్సింహరెడ్డి, క్రాంతి, తదితరులు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

ఇల్లంతకుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి) : మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని పరివాహక రైతులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు శనివారం విన్నవించారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో నారుముదిరిపోతుందని, వేసిన వరిపంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి విడుదలకు కృషిచేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్రంలో రైతుప్రభుత్వం కొనసాగుతుందని, మధ్యమానేరులో నీరు తక్కువగా ఉండటం వల్ల నీటిని విడుదల చేయడం లేదన్నారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళతానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తగా ఉండాలి

ఇల్లంతకుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి) : మండలంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ఉండరాదని, రైతులు, వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలను చెరువులు, కుంటల వద్దకు వెళ్ళనీయవద్దన్నారు.

వంతెన నిర్మాణం చేపడతాం..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై శాశ్వత వంతెన నిర్మాణం చేపడతామని పంచాయితీరాజ్ డీఈ శ్రీనివాస్ అన్నారు. వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టును శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన నిర్మాణం కోసం అంచనా వేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు.ఆయన వెంట ఏఈ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

రసం పీల్చు పురుగుల నియంత్రణపై అవగాహన



పత్తి పంటను పరిశీలిస్తున్న అసిస్టెంట్‌ప్రొఫెసర్ సంపత్ తదితరులు

తంగళ్లపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నియంత్రణకు పసుపు రంగు జిగురు అట్టలు వాడాలని బాబు జగ్జీవన్‌రావు వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ సూచించారు. శనివారం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో పత్తిపంటలో రసం పీల్చు పురుగుల నియంత్రణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించి రసం పీల్చు పురుగుల నియంత్రణకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యశస్విని, ఏఈవో అనూష, ఫైనలియర్ విద్యార్థులు చత్రపతి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం

సిరిసిల్ల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చాడ వెంకటరెడ్డి హైద రాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. దక్షణ కాశిగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో దాదాపు 200 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మంత్రి కొండా సురేఖకు చాడ వెంకటరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేవస్థానంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా సంగం వేతనం మాత్రమే వస్తుందని ఆ వేతనాలు కూడా గత మూడు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉద్యోగులుగా గుర్తించి కార్మికులకు నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ఐడీ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం రూ.25లక్షలు కల్పించాలని మంత్రిని కోరారు. కార్మికులకు రోజుకు ఎనిమిద గంటల పని విధానాన్ని అమలు చేస్తూ, అదనపు పని గంటలకు అదనపు వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్ తరువాత పెన్షన్ సౌకర్యాల కల్పించాలని కోరారు. వేములవాడ దేవాలయానికి నిత్యం పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కార్మికులు వి కీతవ్వ, రేణుక ఉన్నారు.



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందిస్తున్న చాడ, నాయకులు

ముస్తాబాద్-దుబ్బాక రోడ్డును మరమ్మతు చేయాలి

ముస్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్-దుబ్బాక దారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు గుండా వాహనాలపై వెళ్లాలన్నా, దారిగుండా నడువాలన్నా ఇబ్బందిగా మారింది. ఇరుకైన దారి, గుంతలు, వర్షపు నీరు నిల్వతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రతిరోజు వందల సంఖ్యలో సైతం విద్యార్థులు ఇదే దారిగుండా ప్రతిరోజు వెళుతుంటారు. అంతేకాక ఇళ్లలోకి వర్షపునీరు చేరి పాములకు ఆవాసంగా మారుతోంది. రోడ్డును త్వరగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తక్కళ్ళపల్లికి చెందిన పల్లి జమున అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరం కాగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు.2.5లక్షల ఎల్‌వోసి మంజూరుచేయించారని మాజీసర్పంచ్ అల్లకొండ లింగంగౌడ్,ఏఎంసీ డైరెక్టర్ విజయ్ తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు : డీఎస్‌వో



కొలనూరు సహకార సంఘాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం

కోనరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు రైతులకు సకాలంలో అందజేయాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కొలనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంను ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా ఎంఆర్‌పీకంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు తమకు సమీపంలోని సహకార సంఘాల్లో లేదా ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం అవసరమైన పరిమాణం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, నిల్వ చేసుకోవద్దని సూచించారు. వ్యాపారులు ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే, రైతులు వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే, నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అన్ని పంటలపై ఉపయోగించవచ్చని, ఇవి పంట దిగుబడులు పెంచడమే కాకుండా, నేల, నీరు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

తంగళ్లపల్లి : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం తనిఖీ చేశారు. శనివారం తంగళ్లపల్లిలోని గాయత్రీ పెర్టిలైజర్స్, శ్రీరామ ఫెర్టిలైజర్స్‌లను సందర్శించి ఎరువుల నిల్వలు. రికార్డులను పరిశీలించారు. రైతులకు సక్రమంగా ఎరువులను అందించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూడు రోజులు పంటకు ఎరువులు వేయడం నిలిపివేయాలని సూచించారు. నానో యూరియా వాడాలని రైతులకు సూచించారు.

ఈ తనిఖీలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంజీవ్ ఉన్నారు.